సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 7 । ఆగస్టు । 2025



ఒక్కో పోగేసి..
కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు నేత కార్మికులు ఎంపికయ్యారు.
-8లో ▸




వాస్తవాలు వెల్లడించాలి
కాళేశ్వరంపై వెల్లువెత్తిన ఆరోపణలపై అసెంబ్లీ వేదికగా వాస్తవాలు వెల్లడించాలని చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.
-8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
37.3 /22.9
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృమై ఉంటుంది. 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు. జల్లులు పడే అవకాశం ఉంది.

కలకలం.. కలవరం!

సంచలనం సృష్టిస్తున్న ఘరానా దొంగ లీలలు

- గండేడ్‌తో పాటు మహమ్మదాబాద్, హన్వాడ మండలాల్లోనూ బాధితులు
- ఆన్‌లైన్ సెంటర్లు, బ్యాంకుల వద్దకు పరుగులు
- పలువురు అధికారులు, సిబ్బందికి పర్సంటేజీలు
- మోసగాడికి పగిడ్యాల్ తండాకు చెందిన ఓ వ్యక్తి, ఓ మీ సేవ నిర్వాహకుడి సహకారం
- అధికారుల పొంతనలేని సమాధానాలతో మరిన్ని అనుమానాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గండేడ్ మండలం రెడ్డిపల్లికి చెందిన ఘరానా దొంగ బాగోతంపై 'సాక్షి'లో వరుసగా ప్రచురితమైన కథనాలు జిల్లాలో సంచలనం సృష్టిస్తున్నాయి. ఆధార్ కార్డులు, రేషన్ కార్డుల మార్ఫింగ్‌తో మాయ చేసి.. బతికున్న వారి పేరిట తప్పుడు డెత్ సర్టిఫికెట్లతో ఇన్సూరెన్స్ సొమ్ము కాజేసి.. భూమి లేకున్నా ఉన్నట్లు సృష్టించి బ్యాంకుల్లో రుణాలు, రైతు బీమా స్వాహా చేయడంతో పాటు అమాయక రైతులను బురిడీ కొట్టించి, వారికి తెలియకుండానే వారి పేరిట పలు బ్యాంకుల్లో రుణాలు కాజేసిన ఆ ఘనుడి లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గండేడ్‌తో పాటు మహమ్మదాబాద్, హన్వాడ మండలాల్లో కలకలం చెలరేగింది. సదరు ఘరానా దొంగతో పరిచయమున్న వారు, వివిధ పనుల నిమిత్తం అతడిని ఆశ్రయించిన వారిలో కలవరం మొదలైంది. ఈ మేరకు తమ ఆధార్‌కార్డులు, రేషన్ కార్డులను సరి చూసుకునేందుకు ఆన్‌లైన్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. అంతేకాకుండా బ్యాంకుల వద్దకు వెళ్లి.. తమ పేరిట ఏమేం లోన్లు ఉన్నాయో ఆరా తీస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. సదరు ఘరానా దొంగ మోసాలపై ఆయా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు కిమ్మనకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పర్సంటేజీలతో మచ్చిక..

ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, బ్యాంక్‌లకు సంబంధించి ఘరానా దొంగ అక్రమాలకు పాల్పడ్డాడు. ఈ మేరకు అవినీతికి అలవాటు పడిన ఆయా శాఖలకు సంబంధించిన పలువురు అధికారులు, సిబ్బందితో సదరు మోసగాడు చనువు పెంచుకొని.. విచ్చలవిడిగా దందాకు తెగబడినట్లు తెలుస్తోంది. అమాయకులను మోసం చేసే పనికి అనుగుణంగా వారికి పర్సంటేజీలు ముట్టజెప్పినట్లు సమాచారం. ప్రధానంగా గండేడ్, మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని వివిధ బ్యాంకుల్లో అతడు తన హవాను కొనసాగించినట్లు వినికిడి. అతడు తీసుకొచ్చిన వారందరికీ ఆయా బ్యాంకుల్లో రుణాలు మంజూరైనట్లు గండేడ్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో చర్చ జరుగుతోంది. పలు ప్రైవేట్ బ్యాంకుల్లో కొందరు కిందిస్థాయి ఉద్యోగులు ఘరానా దొంగకు సహకరించినట్లు పలువురు చెబుతున్నారు. ధ్రువీకరణ పత్రాలను అసలైనవా.. నకిలీవా అని పూర్తిగా పరిశీలించకుండా రుణాలు మంజూరు చేసిన నేపథ్యంలో ఇది ఎవరి మెడకు చుట్టుకుంటుందోననే భయం వారిలో నెలకొంది.

పొంతన లేని సమాధానాలతో అనుమానాలు

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రుణాల మంజూరుపై ఇటు బ్యాంక్, అటు రెవెన్యూ అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. మహబూబ్‌నగర్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు చెందిన అధికారులను 'సాక్షి' సంప్రదించగా.. 'గొల్ల, కురుమల ఆరాధ్య దైవం పేరు కలిగిన వ్యక్తి గ్యారంటీ ఇచ్చిన రుణాలకు సంబంధించి భూముల పత్రాలు నిజమా.. కావా అని తేల్చాలని హన్వాడ తహసీల్దార్‌ను కోరాం. టంకర గ్రామం నుంచి 26 మంది రుణాలపై అనుమానం రావడంతో నిజనిర్ధారణ కోసం వారిని ఆశ్రయించాం. ఇందులో తప్పుడు పత్రాలని తెలితే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.' అని సమాధానమిచ్చారు. ఆ తర్వాత దీనిపై హన్వాడ తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. 'ఏ బ్యాంకు నుంచీ భూముల రికార్డుల కోసం మా దగ్గరికి రాలేదు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్లు మా దృష్టికి తేలేదు. బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో విచారణ చేసి రుణాలిస్తారు. దానికి మాకేంటి సంబంధం?' అని ప్రశ్నించారు. ఇలా ఇరువురు పొంతనలేని సమాధానాలు చెబుతుండడం అనుమానాలకు తావిస్తోంది.

సహకరించింది ఇద్దరేనా..

గండేడ్ మండలకేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో పంట రుణాలకు సంబంధించి గతంలో కిరికిరి అయింది. ఘరానా దొంగతో పాటు పగిడ్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ తండాకు చెందిన యువకుడు కలిసి తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి..కొందరికి ఈ బ్యాంక్‌లో రుణాలు ఇప్పించారు. ఇది వెలుగులోకి రాగా.. వీరితో సదరు రైతులు, బ్యాంకర్లు గొడవపడ్డారు. ప్రస్తుతం ఘరానా దొంగకు సహకరించిన వారిలో ఆ తండాకు చెందిన వ్యక్తి సైతం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తప్పుడు ధ్రువీకరణ పత్రాల్లో పలువురు అధికారులకు చెందిన సంతకాలను వీరిద్దరూ కలిసి ఫోర్జరీ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా సదరు ప్రభుత్వ శాఖల డూప్లికేట్ స్టాంపులు కూడా వీరి వద్దే ఉన్నట్లు సమాచారం. వీరికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఉన్న ఓ మీసేవ సెంటర్ నిర్వాహకుడు సహకరించేవాడని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈఈ

- రూ.3వేలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం



ఏసీబీకి చిక్కిన ఏఈఈ మహ్మద్ ఫయాజ్

మహబూబ్‌నగర్ క్రైం: మరో అవినీతి చేప ఏసీబీకి చిక్కింది. రూ.3 వేలు లంచం తీసుకుంటూ ఓ ఏఈఈ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ ఇరిగేషన్ సబ్ డివిజన్–1లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)గా పనిచేస్తున్న మహ్మద్ ఫయాజ్.. ఓ వ్యక్తి తన 150 గజాల ప్లాట్‌కు సంబంధించి ఎల్ఆర్ఎస్, ఎన్ఓసీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు రూ.5 వేలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు రూ.3 వేలు లంచం ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం ఈ విషయాన్ని బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. కాగా.. బుధవారం ఉదయం జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్ చౌరస్తాలో ఉన్న ఓ బేకరి దగ్గరకు రావాలని ఏఈఈ ఫోన్ చేయడంతో బాధితుడు అక్కడికి వెళ్లి తన దగ్గర ఉన్న రూ.3 వేల నగదు ఇచ్చాడు. ఆ డబ్బులు తీసుకున్న ఏఈఈ జేబులో పెట్టుకున్న కాసేపటికే అక్కడికి వచ్చిన ఏసీబీ బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. అనంతరం ఏఈఈని నేరుగా కార్యాలయానికి తీసుకెళ్లి.. ఆయన చాంబర్‌తో పాటు వన్‌టౌన్ ఏరియాలో ఆయన అద్దె ఇంట్లో సైతం సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో ఎలాంటి ఆస్తులు, నగదు లభ్యం కాలేదని డీఎస్పీ వెల్లడించారు. మహ్మద్ ఫయాజ్‌ను గురువారం ఏసీబీ కోర్టు నాంపల్లిలో హాజరుపరుస్తామని తెలిపారు.

ఈ ఏడాది ఏడు కేసులు నమోదు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మొదటి కేసు గద్వాల డీపీఓ శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌పై నమోదు కాగా.. మక్తల్ సీఐ చంద్రశేఖర్, వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం విద్యుత్ శాఖ ఏఈ కొండయ్య, మక్తల్ మిషన్ భగీరథ ఏఈ వినోద్, కల్వకుర్తి ఎస్ఐ రాంచందర్‌జీ, భూత్పూర్ ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యంతో పాటు తాజాగా ఇరిగేషన్ ఏఈఈ మహ్మద్ ఫయాజ్ వరుసగా ఏసీబీకి చిక్కారు. వీటితో పాటు అచ్చంపేట బీసీ బాలుర వసతి గృహాన్ని, జడ్చర్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ల బృందం, చిత్రంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ విధుల్లో సీపీఆర్‌పై కూడా అవగాహన కలిగి ఉండడం అవసరమని, ప్రతి ఒక్కరూ దీనిపై పూర్తిస్థాయిలో పరిజ్ఞానం పెంచుకొని అత్యవసర సమయాల్లో ఉపయోగించాలని ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఎంఐసీయూ ఆస్పత్రి ఆధ్వర్యంలో పోలీసులకు సీపీఆర్ విధానంపై శిక్షణ నిర్వహించారు. వైద్యుడు రఘుప్రీత్‌రెడ్డి బృందం ఆధ్వర్యంలో గుండెపోటు లక్షణాలు, గుండెపోటు వచ్చే సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై ప్రాక్టికల్ పద్ధతిలో శిక్షణ ఇచ్చారు. ఆకస్మికంగా గుండెపోటు వస్తే పోలీసు విధుల్లో ఉన్నవారు వెంటనే సీపీఆర్ చేయడం అవగాహన ఉండటం చాలా అవసరమన్నారు.

- ఎస్పీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, సీసీ రాంరెడ్డి, ఎస్‌బీఐ సీఐ వెంకటేష్, ఆర్ఐలు రవి, నగేష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సోకకుండా పారిశుద్ధ్యం పనులపై దృష్టి పెట్టాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు ఆఫీసర్లు, పారిశుద్ధ్య జవాన్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని, మురుగు సాఫీగా ముందుకు వెళ్లేలా చూడాలన్నారు. అలాగే ఆస్తిపన్ను, మున్సిపల్ కాంప్లెక్స్‌ల అద్దె బకాయిలను వసూలు చేయాలని, నగరంలోని దుకాణ దారులందరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎంసీ అజ్మీరా రాజన్న, ఆర్ఓ మహమ్మద్ ఖాజా, ఆర్ఐలు అహ్మద్‌షరీఫ్, రమేష్, టి.నర్సింహ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ప్రొ.జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ శాఖల సిబ్బంది

జయశంకర్ సేవలు చిరస్మరణీయం

- కలెక్టర్ విజయేందిర
- వివిధ సంఘాలు, పార్టీలు ఆధ్వర్యంలో ప్రొఫెసర్‌కు ఘన నివాళి

- వివరాలు 9లో..

న్యూస్‌రీల్

ఎట్టకేలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నియామకం

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా లక్ష్మయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఇక్కడ విధుల్లో చేరారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఈయన తొమ్మిది నెలల నుంచి కేవీ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇప్పుడు అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు డిప్యూటేషన్‌పై వచ్చారు. కాగా, గత జూన్ 23న ఇక్కడి ఎస్ఐలు రవీందర్‌రెడ్డి, గురులింగం, వాణికుమారి పదోన్నతిపై ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన విషయం విదితమే. అప్పటి నుంచి పాలమూరులో హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి మాత్రమే పారిశుద్ధ్య విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 60 డివిజన్ల బరువు బాధ్యతలు ఒక్కరిపైనే పడటంతో నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది. ఇదే విషయమై 'సాక్షి'లో గత నెల 22న 'పర్యవేక్షించేది ఎవరో?' శీర్షికన కథనం ప్రచురితమైంది. చివరకు ముగ్గురి స్థానంలో కొత్తగా ఒక్కరినే డిప్యూటేషన్‌పై ఉన్నతాధికారులు పంపించడం గమనార్హం. మరో ఇద్దరు ఎస్ఐలను నియమిస్తేనే పారిశుద్ధ్యం పనులపై పర్యవేక్షణ పెరిగే అవకాశం ఉంటుంది.

రాష్ట్ర సదనంలో బాలల చట్టాలపై అవగాహన



పాలమూరు: రాష్ట్ర సదనంలో వసతి పొందుతున్న చిన్నారులకు సరైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సూచించారు. జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద ఉన్న రాష్ట్ర సదనాన్ని బుధవారం న్యాయమూర్తి సందర్శించారు. భోజనం, తాగునీరు ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. చిన్నారులతో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించి బాలల హక్కుల చట్టాలు, బాల్య వివాహాలు, విద్యా హక్కుచట్టం, పోక్సో యాక్ట్‌లను వివరించారు. ఏదైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం 11మంది బాలికలకు ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాయడానికి అనుమతి రావడంతో పిల్లల పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని జిల్లా టాస్క్ కో–ఆర్డినేటర్ శివయ్యకు సూచించారు.

పరిహారం మూడింతలు పెంచి ఇస్తాం



దేవరకద్ర: దేవరకద్ర మండలంలోని వెంకటాయపల్లి శివారు నుంచి బల్సుపల్లి వరకు చేపట్టే రైల్వే డబ్లింగ్ పనుల కోసం కావాల్సిన భూసేకరణపై బుధవారం రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ నర్సింహారెడ్డి రైతులతో చర్చించారు. దాదాపు 70 మంది రైతులకు సంబంధించిన భూములను రైల్వే డబ్లింగ్ పనుల కోసం ఇప్పటికే గుర్తించామని ఆయన తెలిపారు. ప్రభుత్వపరంగా ఎకరాకు నిర్ణయించిన ధర కంటే మూడింతలుగా పెంచి నష్టపరిహారం అందించనున్నట్లు వివరించారు. కాగా.. మార్కెట్‌లో ఎకరాకు పలుకుతున్న ధరను దృష్టిలో పెట్టుకొని నష్టపరిహారం లెక్కించి ఇవ్వాలని రైతులు కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని ఆయన తెలిపారు. అనంతరం భూసేకరణ చేసే రైతుల జాబితాలను వెల్లడించారు. ఆర్డీఓ నవీన్‌కుమార్, తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శరత్ పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సర్వసభ్య సమావేశాన్ని గురువారం తెలంగాణ చౌరస్తాలోని రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఎ.రాజసింహుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో కనీస పెన్షన్ పెంపుదల, నూతన కార్యవర్గం ఏర్పాటు, ఇతర సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇంటర్ పూర్తి కాగానే పెళ్లి వద్దు



భగీరథ కాలనీలోని మైనార్టీ గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విజయేందిర

- బాగా చదివి ఉన్నత స్థానంలో నిలవాలి
- విద్యార్థినులకు సూచించిన కలెక్టర్ విజయేందిర

నవాబుపేట: ఇంటర్ పూర్తి కాగానే చాలామంది ఆడపిల్లలు పెళ్లి చేసుకుని చదువును మధ్యలోనే మానేస్తున్నారని.. అలా కాకుండా ఇంటర్ తర్వాతపై చదువులు చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. బుధవారం మండలపరిధిలోని యన్మన్‌గండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినీలతో మాట్లాడారు. ఇంటర్ అనంతరం చదువు ఆపకూడదని, ప్రభుత్వం బాలికల విద్య కోసం చాలా ఖర్చు చేస్తోందని, దానిని ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చాలా మంది ఆడపిల్లల తల్లిదండ్రులు చదివించలేమని చెబుతూ ఇంటర్ కాగానే పెళ్లిలు చేసి తమ బరువును దింపుకుంటున్నారని.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. బాలికల ఉన్నత చదువుల కోసం మంచి అవకాశాలున్నాయని వివరించారు.

అపరిశుభ్రతపై ఆగ్రహం

యన్మన్‌గండ్ల ప్రాథమిక పాఠశాలలో అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు కావాల్సిన కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. మూత్రశాలలు, పరిశుభ్రత విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గదుల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. కళాశాల, పాఠశాలలకు కావాల్సిన మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీకేంద్రంలో చిన్నారులతో మాట్లాడారు. ఎంపీడీఓ జయరాంనాయక్, డీటీ సువర్ణ, ఈఓపీఆర్‌డీ నసీర్ అహ్మద్, ఏపీఓ జ్యోతి, ఐసీడీఎస్ అధికారి రాజారాజేశ్వరి ఉన్నారు.

మైనార్టీ గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం భగీరథ కాలనీలోని మైనార్టీ గురుకుల పాఠశాల 1, 2, 3లో బుధవారం రాత్రి కలెక్టర్ విజయేందిర, మహిళా అధికారులు, భరోసా కేంద్రం సిబ్బంది సందర్శించారు. పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లలు ధృడంగా ఉండాలని అన్నారు. జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, రాత్రి అక్కడే బస చేశారు. కలెక్టర్ వెంట జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శంకరాచారి, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణి జరీనాబేగం, ఎస్సీ అభివృద్ధి అధికారిణి సునీత, బీసీ అభివృద్ధి అధికారిణి ఇందిరా, డీఆర్‌డీఏ అదనపు పీడీలు శారద, ముషాయిదాబేగం, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి పద్మజ ఉన్నారు.

ఆదాయ శాఖకు..అద్దె భవనాలే దిక్కా?

- ప్రైవేట్ ఇళ్లలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- ఆదాయం ఎక్కువ.. వసతులు తక్కువ
- వాహనాల పార్కింగ్‌కూ స్థలం కరువు
- అవస్థలు పడుతున్న క్రయవిక్రయదారులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి



అద్దె భవనంలో కొనసాగుతున్న మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మెట్టుగడ్డ: ఉమ్మడి జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూర్చే ఈ కార్యాలయాలు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఎంత ఆదాయం ఆర్జించినా.. కార్యాలయానికి సొంత భవనాలు సమకూర్చుకోలేని దుస్థితిలో ఈ శాఖ ఉంది. సరైన వసతులు లేకపోవడంతో అక్కడ పనిచేసే ఉద్యోగులు, సిబ్బందితోపాటు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే క్రయవిక్రయదారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల మాట అలా ఉంటే.. ఉమ్మడి జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వ్యవహారాలు పర్యవేక్షించే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం కూడా అద్దె భవనంలోనే కొనసాగుతుండటం మరో విశేషం. ఆడిట్, చిట్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సైతం ఇందులోనే ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులకు సైతం వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెండు చోట్లే పక్కా భవనాలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. ఇందులో కేవలం కల్వకుర్తి, ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు మాత్రమే పక్కా భవనాలు కలిగి ఉన్నాయి. మిగతా పది కార్యాలయాలు అద్దె భవనాల నుంచే రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్నాయి. వీటికి గాను రూ.వేలల్లో ప్రతినెలా అద్దె చెల్లిస్తున్నారు. ఏళ్లతరబడిగా ఇలా చెల్లిస్తున్న అద్దెలతోనే పక్కా భవనాలు నిర్మించవచ్చని ప్రజలు విమర్శిస్తున్నారు. అయితే మక్తల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇటీవల నూతన భవనంలోకి మార్చినా.. అద్దె నిర్ణయించలేదని అధికారులు చెబుతున్నారు.

వసతులు లేక అవస్థలు..

జిల్లాలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా.. ఎక్కడా సరైన వసతులు లేవు. ఒక్కో కార్యాలయానికి సగటున ప్రతిరోజు వందమంది వరకు వస్తుండటంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు, పార్కింగ్, తాగునీరు వంటివి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నారాయణపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చిన్నగా ఉండటంతో పార్కింగ్ లేక అవస్థలు పడుతున్నారు. అచ్చంపేటలో చిన్నపాటి రోడ్డులో ఉండటంతో వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది.

భవనాలకు చెల్లించే నెలవారీ అద్దె ఇలా..

కార్యాలయం	అద్దె(రూ.లలో)
జిల్లా రిజిస్ట్రార్, పరిపాలన విభాగం, మహబూబ్‌నగర్	66,037
నాగర్‌కర్నూల్	15,995
జడ్చర్ల	59,386
నారాయణపేట	8,141
గద్వాల	9,045
అలంపూర్	13,616
వనపర్తి	23,956
కొల్లాపూర్	10,412
అచ్చంపేట	9,910

ఇబ్బందులు లేకుండా చూస్తాం..



నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నూతన భవన ప్రతిపాదనలపై నాకు ఎలాంటి సమాచారం లేదు. అయితే కార్యాలయాలకు వచ్చే క్రయవిక్రయదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం.

– ఫణీందర్, జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లు అధికారి



పార్కింగ్ స్థలం లేక రోడ్డుపైనే వాహనాలు

క్లుప్తంగా

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం


శివరాం (ఫైల్)

లింగాల: మండలంలోని అంబట్‌పల్లికి చెందిన శివరాం (19) ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్నేహితులతో సరదాగా గడిపిన యువకుడు వారి నుంచి వెళ్లి పోయి ఇంటిలోనే ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు భారతి, నిరంజన్ హైదరాబాద్‌లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మృతుడు చదువు మధ్యలోనే మానేసి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

వివాహిత అనుమానాస్పద మృతి


దేవమ్మ (ఫైల్)

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరులో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తలారి రాముడితో జటప్రోల్‌కు చెందిన దేవమ్మ (35)కు ఏళ్ల కిందటే వివాహం జరిగింది. కాగా రాముడు అదే గ్రామంలో ఉండే తమ సమీప బంధువు అయిన సంధ్యారాణితో ప్రేమాయణం సాగించగా ఆమె గర్భం దాల్చింది. దీంతో యువతి తల్లిదండ్రులు అతడికే ఇచ్చి రెండో వివాహం జరిపించారు. తర్వాత దేవమ్మ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లిన కొన్నాళ్లకు సంధ్యారాణి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ నెల 4న పుట్టినరోజు వేడుకకు రాముడు హైదరాబాద్‌లో ఉంటున్న పెద్ద భార్య దేవమ్మను గ్రామానికి తీసుకొచ్చాడు. పుట్టిన రోజు జరిగిన పెద్ద భార్య, భర్త గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన దేవమ్మ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సోదరి మృతిపై అనుమానం ఉందని, భర్త రాముడు గొంతు నులిపి హత్య చేసి ఉంటాడని దేవమ్మ సోదరులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య

గద్వాల క్రైం: అనారోగ్య సమస్యలకు తాళలేక ఓ మహిళ ఉరేసుకుని మృతి చెందిన ఘటన గద్వాల పట్టణంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్ఐ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలిలా.. గద్వాల దౌదర్‌పల్లి కాలనీకి చెందిన మహాలక్ష్మి(30) ఏడాది నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంది. కుటుంబ సభ్యులు వైద్యులకు చూయించినప్పటికి సమస్య నయం కాలేదు. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు అర్ధరాత్రి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బుధవారం ఉదయం మృతురాలి తండ్రి రంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావుపల్లికి చెందిన కదిర మౌనిక (18) మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్థానికుల వివరాల మేరకు.. గంట్రావుపల్లికి చెందిన రాములు - అనిత దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు మౌనిక లింగాల గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివేది. అయితే మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తంచేస్తూ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

హన్వాడ: మండలంలోని టంకర గ్రామానికి చెందిన తాటికొండ పెంటమ్మ(60) వృద్ధురాలు చికిత్స పొందుతూ బుధవారం మృత్యువాత పడినట్లునట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. గ్రామానికి చెందిన పెంటమ్మ గత నెల 5వ తేదీన ఇంటి పక్కనే ఉన్న శివలీల ఇంటికి వెళ్లింది. ఈక్రమంలో గారెలు చేస్తున్న శివలీల అకస్మాత్తుగా నూనె బాండీలో మంటలు రేగడంతో నూనెను బయట పారబోసేందుకు బాండీని బయటికి తీసుకెళ్లింది. అదే ఇంట్లో హాలులోనే కూర్చున్న పెంటమ్మపై నూనెబాండి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం మొదట జిల్లా ఆసుపత్రికి, తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. పెంటమ్మ పరిస్థితి విషమించడంతో మృత్యువాత పడినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు మృతురాలి కుమారుడు తాటికొండ శ్రీనివాసులు పిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఒక్కో పోగేసి.. మెచ్చే చీర నేసి

రాష్ట్రస్థాయి పురస్కారానికి ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు చేనేత కార్మికులు

ఒక్కో పోగు జత చేసి.. కళాత్మకతతో వస్త్రంగా మార్చే నేతన్న కష్టం అసామాన్యం. ఆ శ్రమ వెనుక ఎన్నో ఒడిదొడుకులు దాగి ఉన్నాయి. దశాబ్దాలుగా వస్త్రాలపై వివిధ కళాకృతులను తీర్చిదిద్దుతూ ఔరా అనిపిస్తున్నారు. ఈ క్రమంలో వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి శాఖ అధ్వర్యంలో అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఆరుగురు కార్మికులు రాష్ట్ర పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో వనపర్తి జిల్లా నుంచి నలుగురు, గద్వాల జిల్లా నుంచి ఇద్దరు చేనేత కార్మికులు ఉన్నారు. వీరికి ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందించనున్నారు. రూ.25 వేల నగదు, శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రంతో సత్కరించనున్నారు.

- గద్వాల టౌన్/అమరచింత

కళాత్మకతను రంగరించే గద్వాల చీర



చిత్రంలో కనిపిస్తున్న చేనేత కార్మికుడి పేరు సూర్య వెంకటేష్. ఈయన స్వస్థలం జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోళి. 40 ఏళ్ల నుంచి చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జాతీయ చేనేత దినోత్సవ పురస్కారాల నేపథ్యంలో 70 ఏళ్ల క్రితం నాటి విభిన్నమైన డిజైన్‌తో కూడిన అసలైన గద్వాల కాటన్ చీరను నేసి పోటీకి పంపారు. మీనాకారి బార్డర్, కుట్టు టెక్నిక్‌తో మగ్గం నేశారు. ప్రత్యేకమైన కొంగుతో చీరను తీర్చిదిద్దారు. కొంగును ప్రత్యేకంగా అతికించి, జాకార్డు సాయంతో నాలుగు వేల పోగులతో చీరను నేశారు. అయిదు ఇండ్ల రేషం, అయిదు ఇండ్ల కాటన్ మధ్యలో జరీకడ్డి ఉపయోగించి చెక్స్ డిజైన్ ఉండే విధంగా చీరను నేసి పురస్కారానికి ఎంపికయ్యారు.

నైపుణ్యంతోనే గుర్తింపు..



చిత్రంలో కనిపిస్తున్నది టర్నింగ్ పట్టుచీర. దీనిని జోగుళాంబ గద్వాల జిల్లాలోని గొర్లఖాన్‌దొడ్డికి చెందిన చేనేత కార్మికురాలు లక్ష్మీ నేశారు. 30 ఏళ్లుగా చేనేత కార్మికురాలిగా పనిచేస్తున్నారు. ఇతరులకు భిన్నంగా పనిచేయాలనే ఉద్దేశంతో సాధారణ చీరల తయారీ కాకుండా కష్టమైన టర్నింగ్ పట్టు చీరను తయారు చేశారు. మరింత నైపుణ్యం జోడించి అంచులో రంగు రంగుల హంస, మీనా బొమ్మలతో కూడిన డిజైన్‌తో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఒక వైపు పెద్ద అంచు, మరో వైపు చిన్న అంచుతో అద్భుతంగా నేశారు. మొదటిసారి పురస్కారం అందుకోవడంపై ఆనందం వ్యక్తం చేసింది.



వృత్తికి గౌరవం దక్కింది



40 సంవత్సరాలుగా చేనేత వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. చేనేత వృత్తి సన్నగిల్లినా.. చీరలకు ఆశించిన ధరలు రాకపోయినా జరీ చీరల తయారీపైనే ఆధారపడ్డా. చేతి పనితోనే జరీచీరను 40 గుండీలతో తయారు చేస్తున్నాను. ఒక్క చీర తయారీకి 15 రోజుల సమయం పడుతుంది. వృత్తిపై గౌరవం ఉండి ఇన్నేళ్లుగా చేనేతపై ఆధారపడిన తన లాంటి వాళ్లకు అవార్డు దక్కడం సంతోషంగా ఉంది.

– శీల బుడ్డన్న, చేనేత కార్మికుడు, తిపుడంపల్లి


అవార్డుకు ఎంపికైన శీలం బుడ్డన్న చీర

ప్రతిభ గుర్తించారు..



నాతోపాటు మా కుటుంబసభ్యులు చేనేత వృత్తినే నమ్ముకున్నాం. 45 ఏళ్లుగా జరీ చీరలను తయారు చేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రస్తుత కాలంలో కంప్యూటర్ డిజైన్‌లు రావడంతోపాటు కొత్త కొత్త డిజైన్లలో చీరల తయారు చేస్తున్నాం. వీటిని అదిగమించేందుకు ఎంతో ప్రయత్నిస్తున్నాం. చేతి పనిపై పట్టు సాధించి డిజైన్లలో మార్పులు తీసుకొస్తు చీరలను తయారు చేస్తున్నాను. అవార్డు రావడం ఆనందంగా ఉంది.

– సారంగి రాములు, చేనేత కార్మికుడు, కొత్తకోట

ఆనందంగా ఉంది



కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి పురస్కారానికి నన్ను ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. 60 ఏళ్లుగా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నా. చీరలు నేస్తూ వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషించా. ఇప్పటికీ కుమారులపై ఆధారపడకుండా మగ్గంపై చీరలు నేస్తున్నా. ఇన్నాళ్లకు నా ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– దేవరకొండ లచ్చన్న, చేనేత కార్మికుడు, అమరచింత

ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా..

35 ఏళ్లుగా మగ్గంపై పట్టు చీరలు తయారు నేస్తున్నా. ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ఆర్థికభారాన్ని తట్టుకుంటూ వచ్చే కొంత డబ్బుతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. వృత్తిలో నైపుణ్య పెంచుకుంటూ డిజైన్ల జరీ చీరలను తయారు చేస్తున్నాను. అవార్డుకు ఎంపిక అయ్యావని జౌళి శాఖ అధికారులు తెలిపారు. గర్వంగా ఉంది.

– మహంకాళి సులోచన, చేనేత కార్మికురాలు, అమరచింత



బీచుపల్లిలో పవిత్రోత్సవాలు ప్రారంభం


బీచుపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు పవిత్రమాలలతో గ్రామ ప్రదక్షిణం, ఆలయంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ హోమం, నివేదన, శాత్తుమొరై వంటి ప్రత్యేక పూజలను అర్చకులు వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, పాలక మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామి సన్నిధిలో..

చిన్నచింతకుంట: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని కురుమూర్తి స్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఉదయాన్నే పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం హోమం, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం లక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమ అర్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బందికి ఆలయ కమిటీ ద్వారా నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు వెంకటయ్య, కమిటీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, భాస్కరచారి, నాగరాజు పాల్గొన్నారు.


కురుమూర్తిస్వామి ఆలయంలో హోమం జరిపిస్తున్న పూజారులు

కోర్టు భవనాన్ని త్వరగా సిద్ధం చేయండి


దేవరకద్రలో కోర్టు కోసం పాత మండల పరిషత్ భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి పాపిరెడ్డి

దేవరకద్ర: స్థానికంగా త్వరలో కోర్టును ప్రారంభించాల్సి ఉందని.. పనులు త్వరగా పూర్తి చేసి కోర్టు భవనాన్ని సిద్ధం చేయాలని జిల్లా జడ్జి పాపిరెడ్డి సూచించారు. బుధవారం దేవరకద్రలోని పాత మండల పరిషత్ భవనాన్ని, పరిసరాలను, గదులను ఆయన పరిశీలించారు. భవనాన్ని మరమ్మతులు చేసి రంగులు వేయాలని, కావాల్సిన ఫర్నిచర్‌ను ఏర్పాటు చేస్తే వెంటనే కోర్టును ప్రారంభిస్తామని జడ్జి తెలిపారు. పనులు ఎంత త్వరగా పూర్తి చేస్తే కోర్టు ప్రారంభం అవుతుందని ఇప్పటికే ఆలస్యమైందన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ వెంటనే పనులు చేపట్టాలని సూచించారు. ఈ ప్రాంతానికి కోర్టు రావడం వల్ల చుట్టు పక్కల మండలాలకు సంబంధించిన కేసులను సత్వరం పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆయన వెంట జడ్జి కల్యాణ్ చక్రవర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, న్యాయవాదులు ఉన్నారు.

జోరుగా ఉల్లి వ్యాపారం


విక్రయానికి వచ్చిన ఉల్లి


దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్‌యార్డులో బుధవారం ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. వర్షం లేక పోవడంతో వివిధ ప్రాంతాల నుంచి రైతులు దాదాపు 500 బస్తాల ఉల్లిని విక్రయానికి తీసుకొచ్చారు. మార్కెట్ వ్యాపారులతో పాటు బయటి నుంచి వచ్చిన వ్యాపారులు ఉల్లి వేలంలో పాల్గొని కొనుగోలు చేశారు. క్వింటాల్ గరిష్టంగా రూ. 1,800, కనిష్టంగా రూ. 900 వరకు ధరలు వచ్చాయి. 50కిలోల ఉల్లి బస్తాను గరిష్టంగా రూ. 900, కనిష్టంగా రూ. 500 వరకు విక్రయించారు. ఉల్లి విక్రయాలతో వ్యాపారులు, రైతులు, వినియోగదారులతో మార్కెట్ సందడిగా కనిపించింది.

బస్సు డిపోల పనితీరుపై పరిశోధనకు డాక్టరేట్


రిజిస్ట్రార్‌కు పరిశోధన పత్రాన్ని సమర్పిస్తున్న రితిక బజాజ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో వాణిజ్యశాస్త్రం విభాగం రీసెర్చి స్కాలర్‌గా పనిచేస్తున్న రతిక బజాజ్‌కు పీయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆమె కొన్నేళ్లుగా మాజీ వీసీ రాజరత్నం సమక్షంలో 'తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ ఎంపిక చేసిన బస్సు డిపోల పనితీరు' అనే అంశంపై సుధీర్ఘ పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అందుకు గాను అధికారులు ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే విద్యార్థులు నిర్విరామంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ప్రవీణ, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత


పట్టుబడిన గంజాయితో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఖిల్లాఘనపురం: గంజాయి నిల్వ చేసిన ఓ వ్యక్తిని పట్టుకొని కేసునమోదు చేసిన ఘటన మండలంలోని దొంతికుంటతండాలో మంగళవారం చోటు చేసుకోగా బుధవారం వెలుగు చూసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల కథనం మేరకు.. తండాకు చెందిన పాత్లావత్ లాలూ గంజాయి నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శారద, సబ్ ఇన్‌స్పెక్టర్ దేవులపల్లి కృష్ణ సిబ్బందితో కలిసి మంగళవారం నిఘా ఉంచారు. స్టేజీ నుంచి తండాకు కారులో వెళ్తున్న లాలూను పట్టుకొని తనిఖీ చేయగా 180 గ్రాముల గంజాయి లభ్యమైంది. కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని బుధవారం కోర్టులో హాజరుపర్చినట్లు వారు వివరించారు.

దుందుభీ వాగులో పడి మహిళ మృతి

జడ్చర్ల: మండలంలోని నెక్కొండ గ్రామ శివారులో ఉన్న దుందుభీ వాగులో ప్రమాదవశాత్తు ఓ మహిళ పడి మృతిచెందింది. సీఐ కమలాకర్ వివరాల మేరకు.. నెక్కొండకు చెందిన బెల్లం జ్యోతి (36) బుధవారం వరినారు వేసేందుకు పొలానికి బయలుదేరింది. మార్గమధ్యంలో దుందుభీ వాగు చెక్‌డ్యాంను దాటుతున్న క్రమంలో ప్రమాదశాత్తు కాలుజారి నీటిలో పడిపోయింది. గమనించిన స్థానికులు అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని జ్యోతి మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి మార్చురీకి తరలించారు. మృతురాలి కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

జేఎంఐను సందర్శించిన ఎమ్మెల్యే యెన్నం



వీసీని కలిసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అక్కడున్న జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీని సందర్శించారు. ఈ మేరకు యూని వర్సిటీలోని పలు ప్రదేశాలను పరిశీలించి వి ద్యార్థులకు అందిస్తున్న వసతులు, కోర్సులు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మజహర్ ఆసిఫ్‌ను కలిసి ని యోజకవర్గంలో చేపడుతున్న విద్యాపరమైన అంశాలను ఆయన వివరించారు. వీటితోపా టు అల్‌మదీన ఎడ్యుకేషన్ సొసైటీకి ఇటీవల ఇంజినీరింగ్ కళాశాలకు ప్రభుత్వం అనుమతులిచ్చిన నేపథ్యంలో అక్కడ ఏ కోర్సులు ఉంటే బాగుటుందని, మహబూబ్‌నగర్ వంటి నగరాల్లో విద్యార్థులకు ఎలాంటి విద్యను అందించాలనే పలు అంశాలపై వీసీతో చర్చించారు.

తొలి రోజు చీర్‌ఫుల్ 128/5

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో బుధవారం బీ-డివిజన్ టూ డే లీగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జట్టు చీర్‌ఫుల్ చమ్స్‌తో తలపడింది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి చీర్‌ఫుల్ చమ్స్ 48.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. మహబూబ్‌నగర్ బౌలర్లు ముఖితుద్దీన్, జయంత్ రెండేసి వికెట్లు తీసుకున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పెద్దకొత్తపల్లి: కల్వకోలు గ్రామ శివారులో గల సింగోటం చెరువులో 45 ఏళ్ల వయస్సు గల పురుషుడి శవం లభించినట్లు ఎస్ఐ సతీష్ బుధవారం తెలిపారు. శవం పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా కుళ్లి పోయిందని, శవంపై బూడిద రంగు చొక్కా, నైట్ ప్యాంట్‌తో పాటు కుడిచేతికి రాగి కడియం, ఎడమ కాలికి నల్లటి దారం ఉందని ఎస్ఐ తెలిపారు. శవాన్ని గుర్తుపట్టిన వారు 87126 57721, 87126 57718 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వట్టెం రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యం

బిజినేపల్లి: వట్టెం రిజర్వాయర్‌లో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టెం రిజర్వాయర్‌లోని నీటి గుంతల్లో ఒక మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చామన్నారు. కనీసం మృతదేహం వయస్సును కూడా గుర్తించడానికి వీలు లేకుండా ఉందని తెలిపారు.

'కాళేశ్వరం'పై వాస్తవాలు వెల్లడించాలి

- అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

జడ్చర్ల: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై వెల్లువెత్తిన ఆరోపణలపై అసెంబ్లీ వేదికగా వాస్తవాలు వెల్లడించాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో రెండ్రోజులుగా కొనసాగుతున్న పార్టీ 23వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం జరిగిన సమావేశం, అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని.. మాజీ సీఎం కేసీఆర్ హాజరై చర్చలో పాల్గొనాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద దివంగత సీఎం వైఎస్ఆర్ చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును గత ప్రభుత్వం విస్మరించిందని, పనులు పెండింగ్ పెట్టడంతో వెచ్చించిన నిధులు వృథా అయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తాము తెలంగాణ ఉద్యమంతో పాటు పోరాటం చేశామని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైందని.. సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, కేంద్రం పచ్చజెండా ఊపాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణాపై వివక్ష చూపుతోందని.. ఏపీలో పోలవరంకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్రం రాష్ట్రంలోని ప్రాజెక్ట్‌లకు ఆ హోదా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ,గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. అంతరాలు లేని సమసమాజ నిర్మాణమే భారత కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని తెలిపారు. సమాజంలో డబ్బు, హోదా, కులం, మతం, ప్రాంతం అంటూ అనేక రకాల రూపాల్లో పెరుగుతున్న అంతరాలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎండీ ఫయాజ్, మాజీ కార్యదర్శి పరమేష్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు రాము, అల్వాల్ రెడ్డి, కృష్ణయాదవ్, గోవర్ధన్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

11 యూనిట్లలో 435 మెగావాట్ల విద్యుదుత్పత్తి


నెట్టెంపాడుకు కొనసాగుతున్న నీటి పంపింగ్

ఆత్మకూర్/ధరూరు/రాజోళి: జూరాల ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో బుధవారం విద్యుదుత్పత్తి కొనసాగింది. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 197.568 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 234.576 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఇప్పటి వరకు 432.144 ఎం.యూ. విద్యుదుత్పత్తిని విజయవంతంగా చేపట్టామని పేర్కొన్నారు. కాగా, జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గముఖం పట్టింది. మంగళవారం రాత్రి 8 గంటల వరకు 29,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం సాయంత్రం 7 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 20వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 9,811, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 70, ఎడమ కాల్వకు 1,080, కుడి కాల్వకు 670, సమాంతర కాల్వకు 700, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 13,394 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 8.750 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

⇨ సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. నాలుగు గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 17,784 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. కేసీ కెనాల్‌కు 2,012 క్యూసెక్కుల నీరు వదిలినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 880.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 880.7 అడుగులకు నీటిమట్టం చేరగా.. 191.6512 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 31,780 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 16.990 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు కేంద్రంలో 15.418 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టి 30,816 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 35,000, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు 3,225, ఎంజీకేఎల్ఐకి 3,225 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.